కళత్తూరులో విద్యార్థులకు ప్లేట్లు, నీళ్ల బాటిల్స్ పంపిణీ

ప్రజాశక్తి - కెవిబిపురం

మండలంలోని కళత్తూరులో వరద ముంపు బాధిత విద్యార్థులకు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ప్లేట్లు, నీళ్ల బాటిళ్లను అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్ నేతృత్వంలో 170 స్టీలు ప్లేట్లు, 170 వాటర్ బాటిళ్లను ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న కళత్తూరు దళితవాడ, కళత్తూరు గ్రామం, పాతపాలెం దళితవాడ పాఠశాలల పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రానికి అందజేశారు. సిపిఎం చేయూతను జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.గురవయ్య, వేణు, గురునాథం, నాగలాపురం నాగరాజు, జ్ఞానమ్మ, రాం పాల్గొన్నారు.

హైడ్రా తరహాలో స్వర్ణముఖి ప్రక్షాళన

- అవిలాల చెరువు అభివృద్ధికి చర్యలు
- తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా తరహాలో స్వర్ణముఖి నది ప్రక్షాళన చేస్తామని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తుడా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్వర్ణముఖి నది ఆక్రమణల తొలగింపు ప్రక్షాళనలో భాగంగా ఇప్పటికే డ్రోన్ సర్వే జరుగుతోందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. తిరుపతి నగరాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శెట్టిపల్లి 68 ఎకరాలను తుడా అభివృద్ధి చేస్తుందని, దాదాపు 48 నుంచి 50 ఎకరాల భూమిలో 1800 ఇళ్ల నిర్మాణం చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 320 మంది రైతులకు లాటరీ పద్ధతిలో స్థలాలను కేటాయిస్తామన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. వినాయకసాగర్‌లా అవిలాల చెరువును అభివృద్ధి చేసి, తిరుపతిలో 70-80శాతం తాగునీటి వనరులను సుస్థిరంగా తయారు చేస్తామన్నారు. వానాకాలంలో తిరుపతి మునిగిపోకుండా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పేరూరు నుంచి కళం కాల్వ ద్వారా నీటి ప్రవాహం నియంత్రణతో అవిలాల చెరువులో నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేస్తామన్నారు. తుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత అభివృద్ధి, ప్రజా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గరుడ వారధిపై ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి అల్యూమినియం రైలింగ్ ఏర్పాటు చేపడుతున్నామన్నారు. పర్యాటక రంగంలో కేవలం 18 నెలల్లో పలు మార్పులు చేశామన్నారు. మరియట్, లెమన్‌ట్రీ వంటి స్టార్ హోటళ్లు ప్రారంభమయ్యాయని, నోవోటెల్, పార్క్, పోస్ట్‌కార్డు హోటల్ వంటి ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. పర్యాటకాన్ని పెంచి తిరుపతిని మరింత అందంగా, సుస్థిరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఉమ్మడి సర్వేపై అవగాహన

స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతంలో సమగ్ర సర్వే నిర్వహించాలని తుడ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో తుడా కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ, వేదాంతపురం, తిరుచానూరు స్వర్ణముఖి పరీవాహక ప్రాంతంలో సర్వే నిర్వహించి, ఆక్రమణలను గుర్తించామన్నారు. నది సరిహద్దులు నిర్ణయించే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఆర్‌డిఒ టి.రామ్మోహన్, తుడ సెక్రటరీ శ్రీకాంత్‌బాబు, సర్వే డిపార్టుమెంట్ ఏడి అరుణకుమార్, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వర ప్రసాద్, శివరెడ్డి పాల్గొన్నారు.

'ఆపరేషన్ స్వర్ణ'పై అధికారులతో సమీక్ష

ఓర్వలేకనే విమర్శలు : నరసింహయాదవ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రజాసేవలో 43 ఏళ్ల పాటు ఉన్న టిడిపి తిరుపతిలో కార్యాలయాన్ని నిర్మించుకొనుటకు ప్రభుత్వ స్థలం చట్టబద్ధంగా కేటాయించడంతో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి తన సాక్షి పత్రికలో తప్పుడు కథనాలు రాస్తున్నాడని, జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టి పట్టుమని పదేళ్లు కాకుండానే ప్రతి జిల్లాలోనూ రాజభవనాల్లాంటి పార్టీ కార్యాలయాలను నిర్మించాడన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు టిడిపి కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. టిడిపి కార్యాలయానికి కేటాయించిన స్థలం రైతుల సాగుభూమి కాదని, ముళ్లచెట్టు, పొదలతో నిండిన ప్రభుత్వ భూమి అని తెలిపారు. తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దన్నారు.

వెంకటగిరిలో..

సత్యవేడులో..

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై...

వైసిపి నిరసన గళం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, యంత్రాంగం

గత ప్రభుత్వంలో కట్టించిన వైద్య కళాశాలలను ప్రభుత్వం తరపున నిర్వహించకుండా పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా వైసిపి నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్ర పిలుపు మేరకు చంద్రగిరి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుచానూరు ఘంటశాల విగ్రహం నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం పేదలకు వైద్యవిద్య, మెరుగైన వైద్యం దూరం చేయడానికి కంకణం కట్టుకుందని, అందులో భాగమే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణని అన్నారు. అమరావతి నిర్మాణానికి లక్షల కోట్లు అప్పులు చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం కేవలం ఐదువేల కోట్లు ఖర్చు చేసి వైద్యకళాశాలలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేరా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంపై రాజకీయ కక్ష పెట్టుకుని, వైఎస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను అలాగే వదిలేశారని, ఇపుడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారన్నారు. అలా చేయడం వల్ల రెండేళ్లలో 2450 ఎంబీబీఎస్ సీట్లను ఏపీకి చెందిన విద్యార్థులు కోల్పోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సరైన భవనాలు లేకున్నా అనుమతులు తెచ్చుకుని మెడికల్ కాలేజీలను నిర్వహిస్తుంటే ఏపీలో వున్న భవనాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారన్నారు. తక్షణం ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే జగనన్న నాయకత్వంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉదతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ ఈవో మణికి వినతిపత్రం సమర్పించారు.

గూడూరు టౌన్‌లో వైద్యవిద్య ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని గూడూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మేరిగ మురళి అన్నారు. టవర్‌క్లాక్ సెంటర్ నుంచి సబ్‌కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, జడ్‌పిటిసి ఊటుకూరు యామిని, భక్తవత్సలరెడ్డి, మీరారెడ్డి, గూడూరు ఎంపిపి గురవయ్య పాల్గొన్నారు.

సత్యవేడులో ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పుత్తూరు టౌన్‌లో... మాజీ మంత్రి ఆర్‌కె రోజా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ సాగింది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకూ సాగింది. విగ్రహానికి గలమాల వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్, డి.శంకర్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో...నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కోడూరు కల్పలత, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

తిరుపతిలో... భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, మల్లం రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాలల దినోత్సవం రోజు పరీక్ష వద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, రేణిగుంట

బాలల దినోత్సవం రోజు పరీక్ష జరపడం దారుణమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఒ.వెంకటరమణ వేర్వేరు ప్రకటనలో ఖండించారు. బాలల దినోత్సవం అనేది పిల్లల హక్కులను కాపాడుతూ, వారి సృజనాత్మకతను, చైతన్యాన్ని గుర్తించే రోజని, దేశవ్యాప్తంగా పిల్లల్లో సామాజిక అవగాహన, సృజనాత్మకత, సాంస్కృతిక వ్యక్తీకరణను ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు. అటువంటి ప్రత్యేక దినంలో ఎస్ఎ1 పరీక్ష నిర్వహించడం సబబు కాదన్నారు. పరీక్ష రద్దు చేసి పాఠశాలల్లో సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా బాలల దినోత్సవం జరుపుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షలు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీలోకి లక్ష్మి, కవిత

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభలు అనకాపల్లిలో జరిగింది. రాష్ట్ర మహాసభలలో 53 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా నుండి రాష్ట్ర కమిటీకి పి లక్ష్మి, ఎం కవితలను తీసుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కేంద్రంలోకి ఇద్దరిని ఎంపిక చేసినందుకు యూనియన్ నాయకులు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

పల్లి కొండేశ్వర స్వామి పాలకమండలి సమావేశం

గోసంరక్షణ ట్రస్టుకు ప్రభుత్వం అనుమతివ్వాలి

పల్లికొండేశ్వరస్వామి పాలకమండలి తీర్మానం

ప్రజాశక్తి - నాగలాపురం

'దేవస్థానంలో ఉన్న గోశాలలో 56 గోవుల సంరక్షణకు ప్రస్తుతం పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది సరిపోనందున, అదనంగా మరొకరిని నియమించి గోవుల సంరక్షణ మెరుగుపరిచేలా చూసుకోవాలని, గోసంరక్షణ ట్రస్టు ప్రారంభించుటకు ఉన్నతాధికారుల అనుమతి ఉత్తర్వులు పొందాలని ఈవోను కోరుతూ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం తొలి పాలకమండలి సమావేశం పేర్కొంది. బుధవారం ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు అధ్యక్షతన ఆలయ కార్యనిర్వహణాధికారి లత సమక్షంలో పాలకమండలి తొలి సమావేశం జరిగింది. పలు కీలక అంశాలను పాలకమండలి సభ్యులతో కలిసి చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. దేవాదాయ శాఖ అనుమతికి పంపాలని నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం ఐదు గంటలకు స్వామి అమ్మవార్ల అభిషేకం ప్రారంభమయ్యే సమయానికి గోపూజ చేయాలని, స్వామికి సమర్పించే నైవేద్యం భక్తులకు సరిపోనందున పరిమాణం నాలుగు కేజీలకు పెంచుతూ తగు అనుమతి ఉత్తర్వులను ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. ఆలయంలో టూరిజం డిపార్టుమెంట్ నిధులతో నిర్మించిన కారిడార్ భవనం మరమ్మతులు, పెయింటింగ్ చేయించి భక్తులు బస చేయుటకు వీలుగా ఏర్పాటు చేయాలని చర్చించారు. దాతల సహకారంతో నిర్మించే ఎనిమిది వసతి గృహాల పనులు నెలరోజుల్లోపు పూర్తి చేసి దాతల పేర్లు శిలాఫలకంలో ముద్రించి ప్రారంభించేందుకు కసరత్తు చేయాలని నిర్ణయించారు. ఆలయ విశిష్టతను ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేసి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీకాళహస్తి, కాణిపాకం, బోయకొండ, సూళ్లూరుపేట, తిరువల్లూరు పెరియపాలెం, శిరువాపురి, రేణిగుంటల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2026వ సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఈనెల 27వ తేదీ రాయుటకు చర్చించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రస్తుతం చెల్లిస్తున్న ఉభయం పైకం 35వేల నుంచి 50వేలు పెంచుటకు ఉత్తర్వులు పొందాలని కోరారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు కె.శ్రీనివాసులునాయుడు, క్రిష్ణయ్య, నెల్సన్ మండేలా, హంసరుద్రయ్య, దేవి, ధనశేఖర్, జయంతిమునికుమార్, కవితా చంద్రశేఖర్, నాగభూషణమ్మ, ఆలయ అర్చకులు కార్తికేశన్ పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలోని పరేడ్ మైదానంలో నవంబరు 14వ తేదీ టీటీడీ నిర్వహించనున్న కార్తీక మహాదీపోత్సవం ఏర్పాట్లను జేఈవో వి. వీరబ్రహ్మం బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించే దీపోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ఎస్వీబీసీ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు వేద స్వస్తితో దీపోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం దీప ప్రశస్తి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విష్ణుసహస్రనామ పారాయణం, మహాలక్ష్మీ పూజ, దీప లక్ష్మి నత్యరూపకం, గోవిందనామాలు, చివరగా కుంభ హారతితో రాత్రి 8.30 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, ఎస్వీబీసీ సీఈవో డి.ఫణికుమార్ నాయుడు, ఎస్ఇ మనోహరం, విజివో గిరిధర్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీలో నాణ్యమైన ప్రసారాలు అందించాలి

ప్రజాశక్తి తిరుపతి సిటీ

శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు మరింత నాణ్యంగా ప్రసారాలు అందించేందుకు, ఉద్యోగులు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించేందుకు, పాలన పారదర్శకంగా ఉండేలా, వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో జరిగిన ఎస్వీబీసీ బోర్డు మీటింగ్ లో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీలోని మానవ వనరులు, ఆర్థిక వ్యవహారాలు, ఉత్పత్తి, సరఫరా, నిల్వలు తదితర విభాగాల అంశాలను ఒకే సమగ్ర సాఫ్ట్ వేర్ వ్యవస్థలో సమన్వయం చేసేందుకు సంస్థ వనరుల సమగ్ర ప్రణాళికా వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఎస్వీబీసీ ఇంఛార్జ్ సీఈవో డి. ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఏ అండ్ సీఏవో ఓ బాలాజీ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో నేటి నుంచి నృత్య వాహిని

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నత్య వాహిని' అనే మూడు రోజుల అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి నృత్య మహోత్సవం (ఇంటర్నేషనల్ కల్చరల్ ఎక్స్చేంజి డాన్స్ ఫెస్టివల్) 2025 నవంబర్ 13 నుండి 15 వరకు పిఎమ్ ఉష కార్యక్రమం పరిధిలో నిర్వహించబడుతోందని వర్శిటీ ఉప కులపతి ఆచార్య వి. ఉమ పేర్కొన్నారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ థాయ్‌లాండ్, శ్రీలంక, మహారాష్ట్ర నుంచి వచ్చిన 87 మంది కళాకారులు ఈ అంతర్జాతీయ నృత్యోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 13వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం లో ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ముఖ్య అతిథిగా మైసూరు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ హెచ్.కె. శీల శ్రీధర్ (కర్ణాటక కలాశ్రీ) కీ నోట్ స్పీకర్‌గా హాజరుకానున్నారని చెప్పారు. మొదటిరోజు శ్రీలంకకు చెందిన కాండియన్ డాన్స్ వర్క్‌షాప్‌తో ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. రజని, కన్వీనర్ ప్రొఫెసర్ సి .వాణీ , కన్వీనర్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి (డీన్ ఇంటర్నేషనల్ అఫైర్స్), ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. హిమబిందు పాల్గొన్నారు.

సురేష్ మృతి పార్టీకి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

కామ్రేడ్ సురేష్ మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం అన్నారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో సురేష్ సంతాపసభ జరిగింది. ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ సురేష్ విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐలో చేరి కళాశాలల్లో విద్యార్థుల సౌకర్యాలకై ఉద్యమించారన్నారు. అనంతరం డివైఎఫ్ఐలోనూ, సిఐటియులోనూ చురుగ్గా ఉండేవారన్నారు. ఆర్టీసీలో మెకానిక్‌గా ఉద్యోగంలో చేరి ఎస్‌డబ్ల్యుఎఫ్ అభివృద్ధికి తనవంతు బాధ్యతలు నిర్వహించారన్నారు సిపిఎంలో చేరి తుదిశ్వాస వరకూ నిత్యం పేదలపక్షాన పోరాడారన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శిగా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకునిగా, అంగన్‌వాడి యూనియన్ బాధ్యులుగా ఉన్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారన్నారు. ఆయన మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. అనంతరం సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, గుర్రం రమణయ్య, టి.రామిరెడ్డి, నారా గోపాల్, గోను శివకుమార్ పాల్గొన్నారు.

డ్యూటీ సమయంలో నిర్బంధంపై సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'డ్యూటీ సమయంలో సెల్‌ఫోన్లును కార్మికుల నుంచి తీసుకోవడం ఏంటి' అని సిఐటియు నాయకులు మండిపడ్డారు. తిరుమలలో వకుళమాత గెస్ట్‌హౌస్, నందకం, సూరప్పతోట, అష్ట వినాయక, పాంచజన్యం, కౌస్తుభం, రాంబగీచ గెస్ట్‌హౌస్‌ల్లో డ్యూటీ సమయంలో కార్మికుల వద్ద సెల్‌ఫోన్లు తీసుకోవడం అన్యాయమని, ఫోన్లు తీసుకోకుండా టిటిడి తగు చర్యలు తీసుకోవాలని ఎఫ్ఎంఎస్ కార్మికులు టిటిడి పరిపాలనా భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి. సుబ్రమణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్ర మాట్లాడుతూ డ్యూటీ సమయంలో కార్మికుల నుండి సెల్ ఫోన్లు తీసుకోవడం సరైనది కాదని అన్నారు. డ్యూటీలో కార్మికులను దొంగల్లా చూస్తున్నారని, అవమానపరుస్తున్నారని, వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎంఎస్ కార్మికులకు టీటీడీ ఇచ్చే గౌరవం ఇదేనా ప్రశ్నించారు. కొంతమంది అధికారులు తమ జాగీరు లాగా వ్యవహరిస్తున్నారని, కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడ లేని నిబంధనలు పెట్టి కార్మికులను భయోందోలనకు గురిచేయడాన్ని తప్పుపట్టారు. టీటీడీ యాజమాన్యం వెంటనే స్పందించి డ్యూటీలో సెల్ ఫోన్లు తీసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరంతరం భక్తులకు సేవ చేస్తున్న ఎఫ్ఎంఎస్ కార్మికులకు వైకుంఠ ఏకాదశి శ్రీవారి దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తిరుపతి జేఈవోకు, ఈవోకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్. మాధవ్ కృష్ణ, పి .బుజ్జి, ఆర్ లక్ష్మి, కె వేణుగోపాల్, టిటిడి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. సిద్దయ్య, వి. ప్రభాకర్, టిటిడి కాంట్రాక్ట్ సూపర్వైజర్స్ అండ్ టెక్నీషియన్స్ యూనియన్ ప్రెసిడెంట్ డి. పార్ధసారధి రెడ్డి, టిటిడి కాంట్రాక్ట్ సూపర్వైజర్స్ అండ్ టెక్నీషియన్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎన్. ఏకాంబరంపాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎస్వీయూ వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్

'ఫిజికల్ కెమిస్ట్రీ చదువుకున్న వారికి పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇకపై పాలనాపరమైన బాధ్యతల తరువాత ఏ చిన్న అవకాశం దొరికినా, పాఠాలు బోధించడానికి మళ్లీ ఫిజిక్స్ విభాగానికి వస్తా' అని ఎస్వీయూ వీసీ తాతా నరసింహారావు అన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన భౌతికశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. అర్ధగంటపాటు ఎంఎస్‌సి ఫిజిక్స్ విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఫిజిక్స్ విద్యార్థుల కోసం సమయం వెచ్చించిన వీసీ నరసింహారావుకు విభాగాధిపతి ఆచార్య దేవప్రసాదరాజు కృతజ్ఞతలు తెలిపారు. గొప్ప పరిశోధకుడిగా ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల్లో, పరిశోధనా కేంద్రాల్లో పనిచేసిన అనుభవాన్ని ఫిజిక్స్ విద్యార్థులకు అందించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరగతి పరిశ్రమల డైరెక్టర్‌గా నియమితులైన మురళీమోహన్ (చిన్న బాబు)ను బుధవారం తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నందు సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల అభివద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కె వి చౌదరి , సెక్రటరీ రఘురాం రెడ్డి , తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ రాజు , తిరుపతి జిల్లా ఎఫ్ఎంసిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ సెక్రటరీ మధుసూదన్ రావు ,కొమ్మినేని మోహన్ బాబు పాల్గొన్నారు

కులం పేరుతో అటెండర్లపై దూషణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అటెండర్ స్థాయిలో ఉన్న నాలుగో తరగతి ఉద్యోగులను కులం పేరుతో దూషిస్తూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్న కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డిని సస్పెండ్ చేయాలని ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని కమర్షియల్ టాక్స్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్. సూర్య నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిఎం. రమేష్ కుమార్ మాట్లాడుతూ కమర్షియల్ టాక్స్ కార్యాలయానికి సంబంధించి చిత్తూరు, తిరుపతి జిల్లాకు కలిపి జాయింట్ కమిషనర్ గా రవీంద్రనాథ్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, వాస్తవానికి జాయింట్ కమిషనర్ చిత్తూరు కేంద్రంగా విధులు నిర్వహించాల్సి ఉన్నా, తన వ్యక్తిగత సౌలభ్యం కోసం తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ, చిత్తూరులో పనిచేస్తున్న సిబ్బందిని, అటెండర్లను తిరుపతికి పిలిపించుకుని వ్యక్తిగతంగా పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. జాయింట్ కమిషనర్ వేధింపులకు గురవుతున్న ఇద్దరు అటెండర్లు కారుణ్య నియామకాల కింద కొత్తగా విధుల్లో చేరారని గుర్తు చేశారు. జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డిని సస్పెండ్ చేసి, అతనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిటిఒ వద్ద ఉద్యోగ సంఘాల ధర్నా

కమర్షియల్ టాక్స్ విభాగంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 21వ తేదీ వరకు సమయం ఇస్తున్నామని, ఆరోజు సాయంత్రము 5 గంటలలోపు సమస్యలు పరిష్కారం ఇవ్వాలని, వేధింపులు గురి చేస్తున్న జాయింట్ కమిషనర్ పై సైతం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధతం చేస్తామని ఆచరించారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె. చెన్నకేశవులు, ప్రధాన సలహాదారు బి.గోపాలకష్ణ, డివిజన్ అధ్యక్షుడు టీ. పూర్ణం పాల్గొన్నారు.

సదరం ధ్రువీకరణ స్లాట్ బుకింగ్‌కు అవకాశం: ఎంపిడిఓ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: వివిధ ప్రతిభావంతులకు వైకల్య నిర్ధారణకు ఈనెల 14వ తేదీ నుండి సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపిడిఓ గిర్దయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ 2025 రెండు నెలలకు సదరం స్లాట్ బుకింగ్ నిమిత్తం తమ దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయంలో సదరం స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులలో మంగళవారం శారీరక, మానసిక, బధిరులు, దృష్టి వైకల్యం ఉన్నవారికి, ఏరియా హాస్పిటల్‌లో శారీరక, దృష్టి వైకల్యం కలిగిన వారికి, సిహెచ్‌సిలో సోమవారం శారీరక వైకల్యం ఉన్నవారికి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : విక్రమ విశ్వవిద్యాలయం ఉజ్జయినిలో నిర్వహించిన 67వ అఖిల భారతీయ శాస్త్రార్థ సమారోహంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వ్యాకరణ విభాగం తరఫున విద్యార్థులు వాదవివాద పోటీలో పాల్గొని శ్రేయస్ రాజేశ్వర్ రావ్ ద్వితీయ బహుమతి, మనీష్ సాహూ కన్సోలేషన్ బహుమతి సాధించారు. ముఖ్య అతిథి గౌతమ పట్నాయక్ ప్రభారి, మంత్రి ఉజ్జైన్, కాళిదాస అకాడమీ డైరెక్టర్ డాక్టర్ గోవింద గాంధీ, విక్రమ్ విశ్వవిద్యాలయం వీసి ప్రొఫెసర్ అర్పన్ భరద్వాజ్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం వీసి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి విజేతలను అభినందించి, వారు తీసుకొచ్చిన బహుమతుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాకరణ పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ భరత్ భూషణ్ రథ్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయన హెగ్డే విద్యార్థులను సత్కరించి అభినందించారు.

పరీక్షల తనిఖీ

పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బివిఎన్ కండ్రిగ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం ఎంఈవో ఐ రవీంద్రనాథ్, మురళి సుబ్రహ్మణ్యం, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, , అక్షర పబ్లిక్ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ -1 పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల పరీక్ష విధానం, ప్రశ్నపత్రాల పంపిణీ, పర్యవేక్షణ తీరు, సమాధాన పత్రాల కల్పనను పరిశీలించారు. పరీక్షలు సాఫీగా, నిబంధనలకు అనుగుణంగా వున్నాయా లేదో తెలుసుకున్నారు. ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థుల పరీక్ష సమయానికి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాకాల: ప్రస్తుతం జరుగుతున్న సమ్మేటివ్ -1 పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష ఏఎస్ఓ సారథి అన్నారు. బుధవారం ఆయన పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 లింగయ్య, చంద్రగిరి ఎంఈవో 2 భాస్కర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కార్డులు పంపిణీ

యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కోట : మండలంలో వాకాడ ఏఎంసీ చైర్మన్ మల్లి ప్రమీల ఆధ్వర్యంలో కొత్తపట్నం పంచాయతీ, గోవిందపల్లి రైతు భరోసా కేంద్రం నుండి బుధవారం యూరియా పంపిణీ చేశారు. గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ సహకారంతో ఏఎంసీ చైర్మన్ మల్లి ప్రమీల మాట్లాడుతూ సబ్సిడీ రేటుకు యూరియా అందించే ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మల్లి ప్రమీల మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ దారా సురేష్, కోట మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇసనాల అనోక్, గూడూరు టీఎన్టీయుసి అధ్యక్షుడు చెంగల్ రావు, చల్లా సురేష్, కోట మండల ఎస్‌సి సెల్ సెక్రెటరీ కావాలి చిరంజీవి, గ్రామ పంచాయతీ టిడిపి నాయకులు కార్యకర్తలు, రైతులు, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): మండలంలోని పెద్దకన్నలి, ఇలగనూరు రైతు సేవా కేంద్రాలలో ప్రాథమిక సహకార పరపతి సంఘంలో నిర్వహిస్తున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి యస్. ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు బయో మెట్రిక్ పద్ధతి ద్వారా యూరియా కార్డు ఉన్న రైతులకే పంపిణీ చేయాలన్నారు. రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, తొట్టంబేడు మండల వ్యవసాయ అధికారి యస్. సురేంద్ర రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వంపై గ్రామసభ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్దపాలేడులో స్వామిత్వ పథకంపై గ్రామ కార్యదర్శి నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ రాజేష్ మాట్లాడుతూ స్వామిత్వ పథకంలో భాగంగా పూర్తిచేసిన రెండు నెలలుగా ఇళ్లు, ఖాళీ స్థలాలను సర్వే చేసి 9-2 నోటీసులు ద్వారా యజమానులకు సమాచారం అందించామన్నారు. నోటీసుల్లో తప్పులుంటే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోక మూర్తి, వీఆర్‌వోలు, పంచాయతీ సర్వేయర్లు, సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న టెన్నికాయిట్ పోటీలకు జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డిబిఎస్ డబ్ల్యు కళాశాలలో సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా టెన్నికాయిట్ పోటీలకు జిల్లా జట్లను ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ ఎంపికకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు 20011 జనవరి 1న లేదా తర్వాత గాని జన్మించిన వారై ఉండాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు వెంట పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామ సుందరరావు, కార్యదర్శి గిరిటి చెంచయ్య తెలిపారు.

రూ.2.30 కోట్లతో తారు రోడ్డు

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానానికి నూతనంగా ఏర్పాటుచేసిన బైపాస్ మార్గానికి తారు రోడ్డు వేసేందుకు, గుడిమల్లంలో సిమెంట్ రోడ్లను నిర్మించడానికి రూ.2.30 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు సహకరించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

16న కార్తిక వనభోజనం

ప్రజాశక్తి - చంద్రగిరి : టిటిడికి అనుబంధంగా ఉన్న శ్రీనివాస మంగాపురం లోని శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 16వ తేదీ కార్తీక వనభోజనం నిర్వహించనున్నారు. ఈ కారణంగా నిత్య కల్యాణోత్సవం ఆర్జిత సేవ రద్దయింది. పవిత్రమైన కార్తీక మాసంలో ఇక్కడ వనభోజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సమస్యకు పరిష్కారం

- రోడ్డుపై గుంతల పూడ్చివేత
- ఎస్ఐ చొరవకు అభినందనలు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ఎంతో కాలంగా రోడ్డుపై వున్న గుంతల కారణంగా పలువురు ప్రమాదాలకు గురికావడం చూసిన బివిఎన్ కండ్రిగ ఎస్ఐ తమ చొరవతో వచ్చిపోయే క్వారీ లారీలను ఆపి అందులో వున్న దుమ్మును తీసి గుంతలు పూడ్చివేశారు. దీంతో ప్రమాదాలు తగ్గాయని వాహన చోదకులు ఎస్ఐకి అభినందనలు తెలిపారు.

మండలంలోని చెన్నై రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు ఎంతోమంది ఆ గుంతల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. దాన్ని ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఏ నాయకుడూ పరిష్కరించలేదు. ప్రయాణికులు, వాహన చోదకులు ప్రమాద రహదారిలో ఎన్నో ఏళ్లుగా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించేవారు. ఇటీవల బివిఎన్ కండ్రిగ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిప్రసాద్ రోడ్డు దుస్థితి గమనించి ప్రయాణికుల పరిస్థితి చూసి మానవతా దృక్పథంతో బుధవారం ఉదయం తన సిబ్బందితో పదో మైలు దగ్గర ఎక్కువ గుంతలు వుండడంతో వచ్చి పోయే క్వారీ వాహనాలను ఆపి అందులో వున్న దుమ్మును తీసి గుంతలను పూడ్చారు. దీంతో ప్రయాణికులు తాము ఒక ప్రమాదాలకు గురి కావాల్సిన పరిస్థితి లేదని ఆనందం వ్యక్తం చేశారు. కృషి చేసిన ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది అనిల్ కుమార్, గురవయ్యను వాహన చోదకులు అభినందించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది

అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయం..

నాయుడుపేట ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్

ప్రజాశక్తి-నాయుడుపేట: కూటమి పాలనలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని అటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఇటు పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఇచ్చి ప్రజా పాలనలో భాగస్వాములను చేయడం ఆనందంగా వుందని సూళ్లూరుపేట జనసేన ఇన్‌ఛార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. నాయుడుపేటలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్‌లో జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఏర్పాటు చేసిన నియోజకవర్గ జనసేన కార్యాలయాన్ని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ నిబద్ధతతో పార్టీ ప్రతిష్ట కోసం కృషి చేసిన ఉయ్యాల ప్రవీణ్ సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని, కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం నాయుడుపేట ఏఎంసి ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ తమ అధినేత, పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తనపై ఉంచిన నమ్మకానికి పూర్తి న్యాయం చేస్తానని, రైతులకు అందుబాటులో వుండి సేవ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, మాజీ మంత్రి పరస వెంకట రత్నయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.కె రఫీ, పట్టణ టిడిపి నాయకులు నెలవల రాజేష్, అవధానం సుధీర్, మైలారి రాజశేఖర్ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఫుట్ బాల్‌లో పుత్తూరుకు ప్రథమ స్థానం

ఫుట్‌బాల్ పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : క్రీడలు, విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన భాగమని, క్రీడలు విద్యార్థులను శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తాయని డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. ఇటీవల శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని అంతర కళాశాలల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు విద్యార్థులు ప్రథమ స్థానం పొంది విన్నర్స్ రోలింగ్ కప్పును సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి చంద్రమౌళి మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఫుట్‌బాల్ క్రీడల్లో వరుసగా మూడోసారి ప్రథమ స్థానం పొందడం కళాశాలకు గర్వకారణమని, క్రీడల వల్ల విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి సూర్యబాబు అన్నారు. విద్యార్థులకు సమయ పాలన, పరస్పర సహకారం, క్రమశిక్షణ మొద లైన అలవాట్లు అలవాటు అలవడు తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య, ఫిజికల్ డైరెక్టర్ బి సూర్యబాబు, డాక్టర్ మన్యం నరసింహులు, ఫుట్‌బాల్ కెప్టెన్ ఉదయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే వైసిపి ఉద్యమం: టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి- సత్యవేడు: రాష్ట్రంలో ఉనికి కోసమే ఉద్యమాల పేరిట నాటకాలు ఆడుతోందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులను, యువతను రెచ్చగొట్టడానికే వైసిపి ర్యాలీలు చేస్తోందన్నారు. వైసిపి విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రయివేటీకరణ చేస్తోందని అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 50 శాతం విద్యార్థులకు సీట్లు వస్తాయని తెలిపారు. పేదలకు ఎటువంటి ఒపి రుసుం లేకుండా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. విద్యార్థులను, యువతను రెచ్చగొట్టి రాజకీయం చేయాలని వైసిపీ చూస్తుం డటం తగదన్నారు. ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తూ అబద్దపు మాటలు చెబుతుండడం అన్యా యమన్నారు. విద్యార్థులు, యువతను నమ్మించే ప్రయత్నం వైసీపీ చేస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువతే వైసిపికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పిచ్చాటూరు: అభివృద్ధి, సంక్షేమం పథకాలు అందరికీ అందేలా చూస్తామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో బుధవారం పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో ఎన్టీఆర్ గృహకల్ప పథకం ద్వారా ఓ లబ్ధిదారుడు పూర్తి చేసిన పక్కా ఇల్లు గృహప్రవేశ వేడుకల్లో అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని నియోజకవర్గంలో నిర్వహించనున్న జాబ్ మేళా పై ఎమ్మెల్యే ప్రకటన చేశారు. తర్వాత నారాయణవనం చేరుకొని చేనేత కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తర్వాత నారాయణవనం ఎంఈఓ కార్యాలయానికి ఏర్పాటుచేసిన ప్రహరీ గోడను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్నీ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందించాలని సూచించారు. మరో రెండు రోజుల్లో నిర్వహించనున్న జాబ్ మేళాపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొనే విధంగా చూడాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కోనేటి సుమన్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, నెడ్ క్యాప్ మాజీ చైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, ఎంపీడీవో మహమ్మద్ రఫీ, తహశీల్దారు టీవీ సుబ్రహ్మణ్యం, వాసు రెడ్డి, సుమాంజలి, రవి రవి, రాజేశ్వరి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం ఆర్‌వో ప్లాంట్ ను ప్రారంభించారు. కార్పొరేట్ భాగస్వామ్యంలో భాగంగా రూ. 1.50 లక్షలు విలువజేసే ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో దుస్థితిలో ఏ వసతి గృహం ఉండకూడదని స్పష్టం చేశారు. కార్పొరేట్ భాగస్వామ్యంతో వసతి గృహాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్‌డబ్ల్యూఓ మునీంద్రయ్య, వార్డెన్ రామయ్య పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి నాయకుడికీ గుర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: టిడిపిలో కష్టకాలంలో పార్టీ జెండా మోసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎల్ కళ్యాణమండపంలో నూతనంగా ఎన్నికైన టీడీపీ మండలాధ్యక్షులు, బూత్ సెంటర్ల, వార్డు కన్వీనర్లు అనుబంధ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, మాజీ ఎఎంసి చైర్మన్లు పులుకొల్లు రాజేశ్వరరావు, సిసి నాయుడు, సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీలు, గ్రామ కమిటీ నాయకులు, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం, రూరల్ మండలాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పరిధిలో ఇద్దరికి డాక్టరేట్లు లభించాయి. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం వ్యాకరణ శాస్త్ర పరిశోధక విద్యార్థి తేజా నందనమ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఇన్‌చార్జి పరీక్షా నియంత్రకులు ప్రొఫెసర్ ఎ సచ్చిదానందమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాకరణశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ యశస్వి మార్గదర్శ కత్వంలో 'హిం, ఆంగ్లం, తెలుగు భాషలలో ప్రయోగించిన శబ్దాలకు సంస్కృత భాషా ధాతుమూలకత్వ దృష్ట్యా విశిష్ట అధ్యయనం'అనే అంశంలో పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు.

సుప్రియ బేరాకు డాక్టరేట్

క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగం పరిశోధక విద్యార్థి సుప్రియ బేరాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఇన్‌చార్జి పరీక్షా నియంత్రకులు ప్రొఫెసర్ ఎ సచ్చిదానందమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ రాజేష్ మీనా మార్గదర్శకత్వంలో 'ప్రస్తుత సమాజంలో యోగ దర్శన ద్వారా నిరూపితమైన జీవన విధానం ప్రాసంగికత అధ్యయనం' అనే అంశంపై పరిశోధన గ్రంథం వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

నెరవేరిన పేదల సొంతింటి కల: ఎమ్మెల్యే

ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పేదలకు సొంతింటి కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఎన్టీఆర్ పథకంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి నేడు అప్పగిస్తున్నామన్నారు. నగరిలో 552 ఇళ్లు, పుత్తూరులో 97 ఇళ్లు పూర్తి చేసి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 2014-19 కాలంలో టిడిపి హయాంలో 8 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని, ఇప్పుడు మరో 3 లక్షలు ఇళ్లు పేదలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరలో పూర్తి చేసి అందిస్తామని తెలిపారు. ఇప్పటికే నగరి మున్సిపాలిటీ 460 ఇండ్లు మంజూరు చేశామని, పుత్తూరు మున్సిపాల్టీలో 326 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మాజీ ఎంపీపీ ఏలుమలై అమ్ములు, టిడిపి నాయకులు, హౌసింగ్ డిఈ అధికారులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని మొదటి హరిజన వాడ లో నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చేనేత అధ్యక్షుడు కటికాల శ్రీనివాసులు,ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ అల్లం కృష్ణయ్య, యల్లసిరి శ్రీనివాసులు రెడ్డి,చెన్నూరు. కృష్ణ మూర్తి, కోలా అశోక్, హౌసింగ్ డిఈ షబ్బీర్ , బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ఉల్లంఘన

డిటిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండు

ప్రజాశక్తి- సత్యవేడు: సమాచార హక్కు చట్టం 2005ను ఉల్లంఘిస్తున్న సత్యవేడు డిప్యూటీ తహశీల్దారుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాండీ అరుణాచలం కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము సమాచార హక్కుచట్టం ద్వారా కన్నావరం డీకేటి భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు లబ్ధిదారుల లిస్టు, కంకర క్వారీకి ఇచ్చిన ఎన్‌ఓసి నకలు భూముల వివరాలకు సంబంధించి 11 అంశాలకు సమాచారం ఇవ్వాలని 40 రోజుల క్రితం అర్జీ సమర్పించామని తెలిపారు. అయితే ఈ నెల 11వ తేదీ డిటి దీనిపై రెవెన్యూ రికార్డులలో ఎలాంటి సమాచారం లేదని లిఖిత పూర్వంగా తెలపడం విడ్డూరంగా వుందన్నారు. డీకేటి భూములు కబ్జా చేస్తున్న వారికి పరోక్షంగా సహకరిస్తూ రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టంను డిప్యూటీ తహశీల్దారు నీరు కారుస్తున్నట్లు ఆరోపించారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకుని తగిన సమాచారం ఇప్పించాలని ఆయన కోరారు.

వేడుకగా నారాయణ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నారాయణ విద్యా సంస్థల్లో ప్రీమియర్ లీగ్- 2025 పేరుతో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర కళాశాలల ప్రారంభోత్సవాన్ని పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల ప్రెసిడెంట్ పునీత్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు కేవలం పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకుల సాధనలోనే కాక, విద్యార్థులను అన్ని రంగాలలో అత్యుత్తమంగా నిలిపేందుకు, మానసికోల్లాసాన్ని కలిగించేందుకు క్రీడలను విధిగా ఒక పాఠ్యాంశంగా చేర్చినట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ, క్రీడాకారులకు తమ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రోత్సాహాన్ని వివరించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుబ్బారాయుడు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్నే కాకుండా విద్యార్థులకు గెలుపోటములను సమాన స్థాయిలో స్వీకరించే మానసిక దఢత్వాన్ని కలగజేస్తాయన్నారు. ఒలింపిక్ హాకీ క్రీడాకారిణి రజని మాట్లాడుతూ తాను ఒక మారుమూల గ్రామం నుండి ఒలింపిక్ స్థాయికి వెళ్ళడానికి ఎంతో కషి చేసానని, తాను అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించడం కేవలం క్రీడలతోనే సాధ్యమైందన్నారు. తిరుపతి నారాయణ డీజీఎం కొండలరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 17కళాశాలల్లోని పదివేల మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థి దశలో క్రీడల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మాజీ, కోర్ డీన్ శ్రీనివాస రావు, డీన్స్ వేణుగోపాల్, చక్రవర్తి, సురేష్ పాల్గొన్నారు.

వైద్య విద్యను కాలరాస్తే మహోద్యమం

- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కలిసి రావాలి
- మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ పిలుపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేద వర్గాలకు అందాల్సిన ప్రభుత్వ వైద్య విద్యను కాలరాస్తే మహా ఉద్యమం తప్పదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిపిఎం, సిపిఐలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైసిపి శ్రేణులు బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలో ప్రజా ఉద్యమం, నిరసన ర్యాలీ చేపట్టారు. జగన్ 17 మెడికల్ కళాశాలలకు ప్రాణం పోశారని గుర్తు చేశారు. వాటిల్లో కొన్ని పూర్తికాగా, మరికొన్ని 50 శాతం మేర పూర్తయ్యాయని వివరించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య విద్యను నీరుగార్చేలా కార్పొరేట్ పరం చేస్తోం దని మండి పడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య విద్యను పూర్తి చేయాలంటే ఒక్కో విద్యార్థి గరిష్టంగా రూ.5 కోట్లు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే పైసా ఖర్చు లేకుండా పేద విద్యార్థుల సైతం వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్లుగా మారేందుకు అవకాశం ఉంటుందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ప్రైవేటీ కరణపై వెనక్కి తగ్గాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గ్యాస్ లీక్ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మూడు రోజుల క్రితం గ్యాస్‌లీక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. మండలంలోని కాటూరు హరిజనవాడకు చెందిన నెలటూరు కోటేశ్వరరావు ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఇంట్లో వంట పూర్తిచేసుకుని గ్యాస్ స్టవ్ ఆఫ్ చేయకుండా నిద్రపోయాడు. రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో నిద్రలేచిన కోటేశ్వరరావు క్యాండిల్ వెలిగించేందుకు అగ్గిపెట్టి గీయడంతో గ్యాస్ లీక్ అయ్యి ఇల్లు మొత్తం ఆవరించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో వస్తువులతో పాటు కోటేశ్వరరావు పూర్తిగా మంటలకు కాలిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్యం అందించారు. అక్కడ వీలుకాకపోవడంతో తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి క్షీణించి బుధవారం మధ్యాహ్నం కోటేశ్వరరావు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బివిఎన్ కండ్రిగ ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోటేశ్వరరావుకు పెళ్లి కాని ఇద్దరు కుమార్తెలు వున్నారు. ఆయన రోజువారి కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు కావడంతో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

23న మలయాళ స్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఏర్పేడు: సద్గురు మలయాళ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఈనెల 23 వ తేదీ ఏర్పేడు వ్యాసాశ్రమం సమీపంలో చేయనున్నారు. మునుపటి దినం సద్గురు కాంస్య విగ్రహాన్ని సమీప గ్రామాలు ఏర్పేడు, అమందూరు, సీతారాంపేట, బాలకృష్ణాపురంలో వేదపారాయణ, భగవద్గీత, భజన పాటలు, కోలాటాలు, చెక్క భజనలు, పిల్లన గ్రోవి తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తామని కార్య నిర్వాహకులు తెలిపారు.

కృష్ణమ్మకు నివాళులు

ప్రజాశక్తి- వాకాడు: వాకాడు మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి తల్లి దోసకాయల కృష్ణమ్మ వారం క్రితం మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ దుగరాజపట్నంలోని కృష్ణమూర్తి గృహానికి చేరుకొని కృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, దువ్వూరు జనార్దన్ రెడ్డి, దువ్వూరు అజిత్ రెడ్డి, పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి బత్తిన ప్రమీల, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోన్ని పాలెంపాడు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 85 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 65 దూడలకు నులి పురుగు మందు తాగిం చినట్లు , 25 పశువులకు సాధారణ చికిత్స చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, మునిరాజా, ధనజేయ, శ్రీదేవి, ఏ ఎచ్ ఏ, అశోక్ పాల్గొన్నారు.

ఎన్‌ఎన్ ధనపాల్ ఘన సత్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ మొదలి యార్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రతి పాదనతో పుత్తూరు మున్సిపాల్టీ గేట్ పుత్తూరుకి చెందిన ఎన్‌ఎన్ ధనపాల్ కు పుత్తూరు పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని గజమాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవ రత్నం నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, కౌన్సిలర్ కేశవాచారి, సొరకాయల రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A. No. 379 / 2024, I.A. No. 369 / 2023
O.S.NO. 227 / 2019
Raavindhala Padma,w/o Late S.Venugopal ...Petitioner/D. Hr/Plaintiff
Vs.
V.Santhamma, (Died) W/o V.Sankaran ...Respondent/ J.Dr./Defendant
I.A.NOTICES TO PROPOSED RESPONDENTS NO.2 & 3
1) V. Vinod, S/o V.Sankaran, Hindu,
2) V. Lavanya, D/o V.Sankaran, (W/o Ravi)
both are residing at Buddareddy Palle - Village, Pulikallu - Post, Penumuru Mandal, Chittoor District.
The petitioner/ D.Hr. has filed above petition under Sec.5 of the Limitation Act to condone the delay of 116 days in filing the application in impleading both of you being the legal heirs of deceased respondent/ J.Dr. in the final decree proceedings, is stands posted to **28-11-2025** for your appearance either in person or through advocate to raise objections if any, else the matter will be decided exparte.
P.HEMACHANDRA REDDY
19-45-59-236, BAIRAGIPATTEDA, TIRUPATI

IN THE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A. No. 380 / 2024, I.A. No. 369 / 2023
O.S.NO. 227 / 2019
Raavindhala Padma,w/o Late S.Venugopal ...Petitioner/D. Hr/Plaintiff
Vs.
V.Santhamma, (Died) W/o V.Sankaran ...Respondent/ J.Dr./Defendant
I.A.NOTICES TO PROPOSED RESPONDENTS NO.2 & 3
1) V. Vinod, S/o V.Sankaran, Hindu,
2) V. Lavanya, D/o V.Sankaran, (W/o Ravi)
both are residing at Buddareddy Palle - Village, Pulikallu - Post, Penumuru Mandal, Chittoor District.
The petitioner/ D.Hr. has filed above petition under O.XXII Rules 4 & 9 of C.P.C. to set-aside the abetment in impleading both of you being the legal heirs of deceased respondent/ J.Dr. in the final decree proceedings, is stands posted to **28-11-2025** for your appearance either in person or through advocate to raise objections if any, else the matter will be decided exparte.
P.HEMACHANDRA REDDY
19-45-59-236, BAIRAGIPATTEDA, TIRUPATI

IN THE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A. No. 381 / 2024, I.A. No. 369 / 2023
O.S.NO. 227 / 2019
Raavindhala Padma, w/o Late S.Venugopal ...Petitioner/D. Hr/Plaintiff
Vs.
V.Santhamma, (Died) W/o V.Sankaran ...Respondent/ J.Dr./Defendant
I.A.NOTICES TO PROPOSED RESPONDENTS NO.2 & 3
1) V. Vinod, S/o V.Sankaran, Hindu,
2) V. Lavanya, D/o V.Sankaran, (W/o Ravi)
both are residing at Buddareddy Palle - Village, Pulikallu - Post, Penumuru Mandal, Chittoor District.
The petitioner/ D.Hr. has filed above petition under O.XXII Rules 4 & 9 of C.P.C. r/w. Rule 29 of C.R.P. to implead both of you being the legal heirs of deceased respondent/ J.Dr. in the final decree proceedings and allow to make necessary consequential amendments, is stands posted to **28-11-2025** for your appearance either in person or through advocate to raise objections if any, else the matter will be decided exparte.
P.HEMACHANDRA REDDY
19-45-59-236, BAIRAGIPATTEDA, TIRUPATI

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) ::PAKALA
I.A.No. 96/2022
O.S.No.44/2022
Between:
C. Hemasundaram, s/o. Raghunatham, Desireddiganipalli Village, Nendragunta Post, Pakala Mandal ....**Petitioner/ Plaintiff**
And
P. Jagadesh ....**Respondent/Defendant**
Notice to the Respondent/ Defendant
To
P.Jagadesh, S/o. P. Venkataswamy Naidu, Yellampalli Village, Sankarampalli Post, Pakala Mandal, Tirupati Dist., Previously Chittoor Dist.,
Please take the notice that the above petition U/o 38 R5 cpc in posted to 24.11.2025 in your appearance and you have to appear before the said court on that day either by yourself as through your advocate at about 10:30am or else you will be set exparte and the petition will be proceeded in your absence.
Date of hearing : 24.11.2025
B.C.REDDEPPA NAIDU
ADVOCATE PAKALA
CELL: 9490894793

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) ::PAKALA
O.S.No.44/2022
Between:
C. Hemasundaram, s/o. Raghunatham, Desireddiganipalli Village, Nendragunta Post, Pakala Mandal ....**Plaintiff**
And
P. Jagadesh ....**Defendant**
Summons to the Defendant
To
P.Jagadesh, S/o. P. Venkataswamy Naidu, Yellampalli Village, Sankarampalli Post, Pakala Mandal, Tirupati Dist., Previously Chittoor Dist.,
Please take the suit summons that the above suit in posted to 24.11.2025 for your apperance and you have to appear before the said court on that day either by yourself or through your advoate at about 10:30 am or else you will be set exparte and the suit will be proceeded in your absense.
Date of hearing : 24.11.2025
B.C.REDDEPPA NAIDU
ADVOCATE PAKALA
CELL: 9490894793

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శ్రీసిటీ స్ఫూర్తిదాయకం

- శ్రీసిటీ సందర్శనలో 'జాగృతి యాత్ర' బృందం ప్రశంస

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శ్రీసిటీ స్ఫూర్తిదాయకమని జాగృతి యాత్రా బృందం ప్రశంసించింది. జాగృతి యాత్రా బృందానికి చెందిన 525 మంది సభ్యులు బుధవారం శ్రీసిటీ సందర్శించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారుచేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా 8 వేల కిలోమీటర్లు పర్యటించి, వివిధ రంగాలలో ఆదర్శవంతులను (రోల్ మోడల్‌లు) కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికులలో స్ఫూర్తి నింపుతుంది. శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి యాత్రా బృందానికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక కేంద్రం ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పర్యటనలో భాగంగా యాత్రికులు శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక పురోగతిని నేరుగా వీక్షించడంతో పాటు పలు బ్యాచ్‌లుగా విడిపోయి డైకిన్, బ్లూ స్టార్, ఈ ప్యాక్, పెప్సికో, అంబర్, రాక్‌వర్త్, బెర్గెన్ పైప్ సపోర్ట్స్, ఎఎల్ఎఫ్, ఆర్ఎస్‌బి, ఎంఎండి, బ్రేక్స్ ఇండియా, డైకి అల్యూమినియం పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, ఉపాధి, వివిధ రకాల ఉత్పత్తులు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ బృందానికి సందర్శన అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈఓ అశుతోష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడులు , ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అపార అవకాశాలు వున్న సంపూర్ణ వ్యాపార నగరానికి శ్రీసిటీ ఒక చక్కటి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల సందర్శన అనంతరం బుధవారం రాత్రి వారి రోల్ మోడల్ గా ఎంచుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జాగృతి సభ్యులతో సమావేశమవుతారు. ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రయాణం, దార్శని కత, సవాళ్లు, మైలురాళ్లను వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

శ్రీసిటీని సందర్శించిన జాగృతి యాత్ర బృందం

తిరుపతి జిల్లాలో క్లెయిమ్ చేయని నిధులు రూ.86.31 కోట్లు

- 'మీ డబ్బు-మీ హక్కు'పై అవగాహన
- జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎల్‌డిఎం గుంటూరు రవికుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్మును తిరిగి పొందే అవకాశం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కల్పించింది. ఇందుకోసం 'మీ డబ్బు - మీ హక్కు' అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 14 వ తేదీన తిరుచానూరులోని ఇండియన్ బ్యాంకులో నిర్వహించారు. జిల్లాలో ఇలాంటి 5,14,468 ఖాతాల్లో మొత్తం రూ.86.31 కోట్లు క్లెయిమ్ చేయని నిధులుగా ఉన్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవి కుమార్ తెలిపారు. వీటిలో వ్యక్తిగత ఖాతాల్లో రూ.60.20 కోట్లు, వివిధ సంస్థలకు చెందిన 30,400 ఖాతాల్లో రూ.20.83 కోట్లు, అలాగే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ శాఖల 5,764 ఖాతాల్లో రూ.5.28 కోట్ల నిల్వలు ఉన్నాయని వివరించారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, లేదా నామినీ వివరాలు తప్పుగా ఉండటం వంటి కారణాలతో ఈ ఖాతాలు నిర్జీవంగా మారాయన్నారు. పదేళ్లకుపైగా లావాదేవీలు లేని ఖాతాల్లోని సొమ్మును తిరిగి ఇచ్చే ప్రక్రియను ఆర్‌బీఐ ప్రత్యేకంగా ప్రారంభించింది. ఖాతాదారులు లేదా వారి నామినీలు తమ సంబంధిత బ్యాంకు శాఖను సంప్రదించి, సరైన ధ్రువపత్రాలు సమర్పించి, ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. తద్వారా క్లెయిమ్ చేయని నిధులను తిరిగి పొందవచ్చని లీడ్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు. ప్రతి అర్హుడు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, సొమ్మును తిరిగి పొందాలని జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి తెలిపారు.

తిరుమలలో మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి -తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమల శ్రీకృష్ణ అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మర్యాదపూర్వకంగా కలిసిన టిటిడి ఓఎస్‌డి సత్రే నాయక్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి గురుస్వామి శెట్టి వున్నారు. గురువారం ఉదయం విఐపి దర్శన సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకుంటారు.

ఇంటి స్థలం ఆక్రమణపై బాధితుడు ఫిర్యాదు

స్పందించిన రెవెన్యూ, పోలీసు అధికారులు

ప్రజాశక్తి -కోట : కోట మండలం గూడలి గ్రామ పంచాయతీ లోని అరుంధతి వాడలో బుధవారం ఆరూరు ప్రభాకర్, వెంకట రమణమ్మ దంపతులకు చెందిన ఇంటి రహదారి ని పక్కనే నివాసం ఉంటున్న కొంతమంది కబ్జాదారులు ఇంటిలోకి వెళ్లనీయకుండా ఫెన్సింగ్ రాళ్లు నాటి గృహనిర్బంధం చేశారు. దీంతో ఆరూరు ప్రభాకర్ కుటుంబ సభ్యులు, స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వగా తక్షణమే కోట తహశీల్దారు కటారి జయజయరావు ఆదేశాల మేరకు అధికారులు స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా కంచె నాటిన స్థలం గ్రామ కంఠం అని నిర్ధారించారు. అనంతరం కబ్జాదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ గ్రామ కంఠ భూమిని స్థానికంగా ఉన్న కొంతమంది దారికి వాడుకుంటూ ఉండగా ఈ మధ్య స్థానికంగా ఉన్న ఓ కబ్జాదారు సుమారు మూడు గృహాలకు కాలిబాట లేకుండా చేసి ఫెన్సింగ్ రాళ్లు నాటారు. దీంతో ట్రైనింగ్ ఎస్సై నిఖిల్, కానిస్టేబుల్ అనీల్, విఆర్ఓ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి కీర్తన, విఆర్ఏలు పాతిన రాళ్లను తొలగించారు.

సొమ్మొకరిది.. సోకొకరిది..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సొమ్మొకరిది..సోకొకరిదిఅంటే ఇదేనేమో..!! రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటిపోతోంది. ఇప్పటి వరకు ఒక్క పక్కా గృహం కూడా కూటమి ప్రభుత్వం మంజూరు చేయలేదు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి పేదల సొంతింటి కల నెరవేర్చామంటూ బుధవారం పెద్ద ఎత్తున పేపర్ ప్రకటనలు ఇస్తూ సామూహిక ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం వద్ద ఓ లబ్ధిదారుడి ఏకైక ఇంటిని బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సామూహిక ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన గృహాన్ని ఇప్పుడు పూర్తి చేసి ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకుంటున్నారన్న విమర్శ కూటమి ప్రభుత్వంపై వస్తోంది. సదరు వ్యక్తికి సొంత ఇంటి స్థలం ఉండగా పీఎంఏవై పథకం కింద వైసీపీ హయాంలో ఇళ్లు మంజూరైంది. అప్పటి 2.80 లక్షల స్కీం కు రూ. 1.30 లక్షలు నిధులు మంజూ రయ్యాయి. ప్రభుత్వం మారడంతో మిగిలిన నిధులను మంజూరు చేసి గృహాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రూ. 2.80 లక్షలకు తోడు లబ్ధిదారు మరో రూ. 6 లక్షలు జమచేస్తేనే ఇల్లు పూర్తయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా పీఎంఏవై పథకానికి ఈ 18 నెలల కాలంలో కనీసం ఒక్క దరఖాస్తు కూడా ప్రభుత్వానికి అందలేదని హౌసింగ్ అధికారులు చెప్పారు. స్కీంలో ఉన్న కఠిన నిబంధనలు, సాంకేతిక ఇబ్బందులు ఇందుకు కారణమని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం చాపకిందనీరులా ఇళ్ల పంపిణీకి పూనుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అంతా అనుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకొంది నెల్లూరు జిల్లా, రామలిగాపురానికి చెందిన బోల్లేదుల. గోపి, దొరవారి సత్రంలో రోడ్డు దాటుతున్న సమయంలో నాయుడుపేట నుండి సూళ్లూరుపేటకు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి ని చికిత్స నిమిత్తం, 108 సాయంతో నాయుడుపేట ప్రభుత్వం హాస్పిటల్‌కి తరలించారు. యస్ఐ అజయ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

- ఉద్యాన అధికారి ఆనందరెడ్డి

ప్రజాశక్తి-బాలాయపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులను సాధించుకోవచ్చని వెంకటగిరి ఉద్యాన అధికారి ఆనంద రెడ్డి సూచిం చారు. రైతులు ఎవరైనా కొత్తగా పండ్ల తోటలు వేసివుంటే దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి రైతులు బ్యాంకు పాసుబుక్, వన్ బి,పట్టా పాసు బుక్ అప్లికేషన్ ఫారం తీసుకొని మీ దగ్గరలోని రైతు సేవాకేంద్రాలని సంప్రదిం చాలన్నారు.

ఎమ్మెల్యేను అభినందిస్తున్న ముస్లిం సోదరులు

ఎమ్మెల్యేకు ముస్లింల అభినందనలు

ప్రజాశక్తి.- పుత్తూరు టౌన్: ముస్లిం మైనారిటీలకు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు 12నెలల ఇమామ్ , మౌజ్జన్ గౌరవ వేతనాల నిమిత్తం 90 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ జిఓ ఇచ్చారు. ఇమామ్ , మౌజ్జన్ గౌరవ వేతనాల నిమిత్తం 90 కోట్ల రూపాయలు విడుదల చేసిన ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌కు, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు ముస్లిం సోదరులు ధన్యవాదాలు తెలిపారు. నగరి నియోజకవర్గం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సెల్ సభ్యులు, నగరి నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫీ అహ్మద్, గేట్ పుత్తూరు మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్, ముతవల్లి మహమ్మద్ గౌస్ , నగరి నియోజకవర్గ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఎద్దుల హుస్సేన్ నగిరి నియోజకవర్గ అధికార ప్రతినిధి చాను చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే షబ్బర్, హమీద్ బాష నగరి నియోజకవర్గం టిడిపి తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రెటరీ యూనిస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి

కార్యకర్తలే పట్టుకొమ్మలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కార్యకర్తలే టిడిపికి పట్టుకొమ్మలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో బుధవారం శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చంద్రబాబు, లోకేష్ లక్ష్యాలను మండలాధ్యక్షులు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కష్టపడే వ్యక్తులకు పార్టీ, బొజ్జల అండ ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.